

హుజూరాబాద్‌టౌన్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

# ప్రాణమున్నంత వరకూ బీఆర్‌ఎస్‌తోనే

- కేసీఆర్ వెంటే ఉంటా
- చిల్లరగా వీడియోలు, ఆడియోలు మార్ఫింగ్ చేస్తే సహించేది లేదు
- నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 4 : తన గొంతులో ప్రాణమున్నంత వరకు కేసీఆర్, బీఆర్ఎస్‌తోనే ఉంటానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. తనంటే గిట్టని వారు కొందరు తన పాత ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి సోమవారం ఉదయం పీసీసీ అధినేత రేవంత్‌రెడ్డిని కలిసినట్లు దుష్ప్రచారం చేశారని, వారికి కొంచమైనా సిగ్గు, శరం, లజ్జ ఉండాలని మండిపడ్డారు. తాను గెలిచినప్పటి నుంచి హుజూరాబాద్‌లోనే ఉన్నానని, ఊరు విడిచి ఎక్కడికీ వెళ్లలేదని స్పష్టం చేశారు. స్థానిక సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు ఎన్నికలప్పుడు ఏమైతే హామీ ఇచ్చానో, తనపై ఎంతో నమ్మకం పెట్టుకొని గెలిపించారో.. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. నియోజకవర్గాన్ని అద్భుతమైన అభివృద్ధి చేసుకుంటామన్నారు. తనపై కొందరు కక్షగట్టి ఎందుకు ఇలా దుష్ప్రచారం చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మాట తప్పనని, మడమ తిప్పనని, గొంతులో ప్రాణమున్నంతవరకు కేసీఆర్ కుటుంబంతోనే, బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని స్పష్టం చేశారు. ఎవరెన్ని చిల్లర వీడియోలు, ఆడియోలు చేసి, ప్రచారం చేసినా ప్రజలు నమ్మవద్దని కోరారు. కేసీఆర్ రాష్ట్రంలో అమలుపరిచిన సంక్షేమ పథకాలను కొత్తగా ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వం యధావిధిగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన పథకాలను అమలు చేస్తూనే పాత పథకాలైన కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్, షాదీముబారక్, తదితర పథకాలను అమలు చేయాలన్నారు. తను గెలిచిన తర్వాత ఘన స్వాగతం పలికి, పూల బొకేలతో, శాలువాలతో సత్కరించిన వారందరికీ కౌశిక్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రజలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, రైతు సమన్వయ అధ్యక్షులు, పార్టీ గ్రామశాఖల, వార్డు శాఖల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కౌశిక్‌రెడ్డి సతీమణి శాలిని, కూతురు శ్రీనికారెడ్డి మాట్లాడుతూ తమ విజ్ఞప్తిని మన్నించి నియోజకవర్గ ప్రజలు, బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్, సింగిల్ విండో అధ్యక్షుడు ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, మండల, పట్టణ శాఖల అధ్యక్షులు సంగెం ఐలయ్య, కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ వార్డుల అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారు పార్టీ రాలేదట.. పించన్ అత్తదా అక్కా

‘అక్కా.. మనమొకటి అనుకుంటే ఇంకోటాయే. కారు పార్టీ రాలేదట కదనే. మరీ మనకు నెలనెలకు అచ్చే పింఛన్ అత్తదా..? లేదా..?’ అంటూ ఇద్దరు వృద్ధుల మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. ఈ సన్నివేశం వేములవాడలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చోటుచేసుకున్నది. ‘నేను కారు గుర్తుకే ఓటేసిన. కానీ, చేతి గురుతోళ్లు గెలించింన్రట. ఇగ ముసళోళ్లకు పింఛన్ రాదని మా ఊళ్లె భయపెడుతున్నరు. ఇది నిజమేనా..?’ అని ఓ ఇద్దరు వృద్ధ మహిళలు ముచ్చటించిన తీరును అక్కడివారు ఆసక్తికరంగా వింటూ ముసిముసి నవ్వులు నవ్వారు. కేసీఆర్ సారంటే వీళ్లకు ఎంత నమ్మకమో అని చర్చించుకోవడం కనిపించింది.

**- వేములవాడ, డిసెంబర్ 4**



వేములవాడ పట్టణంలో పెన్షన్ గురించి మాట్లాడుకుంటున్న వృద్ధులు

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

# అభివృద్ధి కోసం పని చేస్తా

- జీవితాంతం బీఆర్‌ఎస్‌తోనే ఉంటా
- ప్రతిపక్షంలో ఉండి ప్రభుత్వ హామీలపై పోరాడుతా
- పార్టీ మారే ప్రసక్తే ఉండదు
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి, డిసెంబర్ 4: తన జీవితాంతం బీఆర్ఎస్‌తోనే ఉంటానని, భవిష్యత్‌లోనూ పార్టీ మారే ప్రసక్తే ఉండదని కోరుట్ల ఎమ్మెల్యే డా కల్వకుంట్ల సంజయ్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజలు ఇచ్చే తీర్పును ఎవరైనా స్వీకరించాలని చెప్పారు. అధికారంలో లేకున్నా ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై పోరాడుతానని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో ప్రత్యర్థులు తప్ప శత్రువులు ఉండకూడదని, నియోజవకర్గాన్ని కలిసి కట్టుగా అభివృద్ధి చేసుకుందామని, తనతో కలిసిరావాలని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. మెట్‌పల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడం బాధగానే ఉందని, తొమ్మిదిన్నర ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. కోరుట్ల గడ్డ బీఆర్ఎస్ జెండా అని, 2009 నుంచి నాలుగు సార్లు తన తండ్రి విద్యాసాగర్‌రావును, ఐదో సారి తనను నియోజకవర్గ ప్రజ లు ఆదరించి గెలిపించారన్నారు. స్థానికేతరులకు అవకాశం ఇవ్వకుండా మన బిడ్డనే ఎమ్మెల్యేగా ఉండాలని తనను ఆశీర్వదించారని, వారి నమ్మకాన్ని నిలబెడతానని, ఆకాంక్షలను నెరవేరుస్తానని పేర్కొన్నారు. కేసీఆర్ స్ఫూర్తితో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని, నియోజకవర్గానికి రావాల్సిన నిధులను ప్రభుత్వం నుంచి పోరాడి సాధిస్తానన్నారు. వైద్య వృత్తి నుంచి తాను రాజకీయాల్లోకి వచ్చానని, వంద శాతం నిజాయితీగా పని చేస్తామనన్నారు. అందరినీ కలుపుకొని అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతానన్నారు. ప్రజా సేవలో వైద్యం కూడా ఒక భాగమేనని, వైద్య సేవలు కూడా కొనసాగిస్తానని స్పష్టం చేశారు. రైతుల కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో పాటు విద్యా, వైద్యం, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానని పేర్కొన్నారు. తన గెలుపునకు సహకారం అందించిన నియోజకవర్గ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, పాల్గొన్నారు.

## కరీంనగర్ డెయిరీ సందర్శన

కొత్తపల్లి, డిసెంబర్ 4: ఎస్ఆర్ఎం ఎంబీఏ కళాశాల విద్యార్థులు సోమవారం కరిక్యులంలో భాగంగా కరీంనగర్ పాల డెయిరీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాల సమీకరణ, పాశ్చరైజేషన్, ఉప పదార్థాల తయారీ, మార్కెటింగ్ విధానాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్లాస్ రూమ్ బోధనతో పాటు, పారిశ్రామిక సందర్శనను ప్రోత్సహిస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని కళాశాల చైర్మన్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఇక్కడ ఎంబీఏ విభాగ ఇన్‌చార్జి డాక్టర్ ఎండీ ఖాజా మొయినొద్దీన్, అధ్యాపకులు ఉన్నారు.

## వృద్ధురాలిపై కత్తితో దాడి

**దవాఖానలో చికిత్స పొందుతూ మృతి ● కనగర్తిలో ఘటన**

ఇల్లందకుంట అక్టోబర్ 4: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన మట్ట లక్ష్మి (70)పై అదేగ్రామానికి చెందిన యువకుడు కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన ఆమెను దవాఖానలో చేర్పించగా పరిస్థితి విషమించి మరణించింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంచ కుమార్‌కు గతేడాది వివాహం జరిగింది. పెండ్లయిన కొంతకాలానికే భార్యతో తరుచూ గొడవపడేవాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పలుసార్లు పంచాయితీలు పెట్టినా భ్యారను పంపించేలేదు. గతవారం కుమార్ సర్పంచ్ రజితావాసుదేవరెడ్డి ఇంటికి వచ్చాడు. తన భార్యతో పంచాయితీ పెట్టాలని అడిగాడు. వాసుదేవరెడ్డి నీ ప్రవర్తన మంచిగా లేదని మందలించాడు. దీంతో అతడిపై కక్ష పెంచుకున్నాడు. సోమవారం రాత్రి కుమార్ బ్యాగులో కారం పొడి, కంకరరాళ్లు, కత్తితో వాసుదేవారెడ్డి ఇంటికి వచ్చాడు. ఇంటి ముందు కూర్చున వాసుదేవారెడ్డి తల్లిపై మూడు సార్లు కత్తితో పొడిచాడు. లక్ష్మి కేకలు వేయడంతో ప్రక్కన ఉన్న వారు వచ్చే వరకు కుమార్ అక్కడి నుంచి పారిపోగా, గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద గ్రామస్తులు పట్టుకున్నారు. తీవ్రగాయాలైన లక్ష్మిని అటోలో జమ్మికుంటకు ప్రభుత్వ ధవఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న హుజురాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, ఎస్ఐ రాజ్‌కుమార్ దవఖానకు చేరుకొని జరిగిన ఘటనా పూర్వపరాలను తెలుసుకున్నారు. మృతురాలు కుమారుడు మట్ట వాసుదేవారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిశోర్ చెప్పారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు

రాంగనర్, డిసెంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ సంఖ్యలో ప్రజలు గుమిగూడడంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ వ్యవహారంపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ వ్యవహారంపై పోలీసులను దుర్భాషలాడాడని హెడ్ కానిస్టేబుల్ అంజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద 188, 353, 290 506, రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రాంచందర్‌రావు తెలిపారు.